నా నామస్మరణకే లోకేశ్ పరిమితం



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో అనిల్‌కుమార్

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లాలో టీడీపీ నేత నారా లోకేశ్ అడుగుపెట్టిన నాటి నుంచి తన నామస్మరణేనని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ విమర్శించారు. నగరంలోని 42వ డివిజన్లో గల అమీన్‌నగర్, మీరామొహిద్దీన్ దర్గా రోడ్డు, క్వార్టర్స్ రోడ్డు, తదితర ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఇంటింటికీ వెళ్లి వివరించిన అనంతరం ఆయన మాట్లాడారు. నగర నియోజకవర్గంలో మీటింగ్‌ను ఏర్పాటు చేసేందుకు జనసమీకరణ అవసరమవడంతో ఒక రోజు లోకేశ్ విశ్రాంతి తీసుకున్నారని విమర్శించారు. వీఆర్సీ సెంటర్‌లో సభను నిర్వహించి ఏదో విజయవంతమైందంటూ పొంగిపోతున్నారని చెప్పారు. సభలో జనం లేకపోతే బాగుండదనే ఉద్దేశంతో నారాయణ విద్యాసంస్థలకు సెలవును ప్రకటించి వారి సిబ్బంది మొత్తాన్నీ తీసుకొచ్చారని ధ్వజమెత్తారు. ప్రతి డివిజన్లో బస్సులను ఏర్పాటు చేసి దానికి నారాయణ విద్యాసంస్థల ప్రిన్సిపల్స్‌తో పర్యవేక్షణ చేయించడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. రానున్న ఎన్నికల వరకు వారిని ఇలాగే ఉపయోగించుకుంటారని తెలిపారు. టీడీపీ నేతలు, కార్యకర్తలకు అప్పగించాల్సిన బాధ్యతలను ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్స్‌కు ఇవ్వడం విచిత్రంగా ఉందన్నారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్ కరిముల్లా పాల్గొన్నారు.

ఘనంగా రోశయ్య జయంతి

నెల్లూరు(బృందావనం): మాజీ సీఎం కొణిజేటి రోశయ్య జయంతిని పప్పులవీధిలోని పాండురంగ అన్నదాన సమాజంలో మంగళవారం నిర్వహించారు. రోశయ్య చిత్రపటానికి నుడా చైర్మన్, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ నివాళులర్పించారు. అనంతరం పాండురంగ అన్నదాన సమాజం వద్ద పేదలకు అన్నదానం చేశారు. అర్బన్ ఆర్యవైశ్య సంఘ గౌరవాధ్యక్షుడు కోట సూర్యనారాయణ, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ గాదంశెట్టి గోపాల్, వాసవీ సేవాదళ్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు,, మహిళా విభాగ అధ్యక్షురాలు గుండ్లపల్లి పద్మప్రియ, ప్రధాన కార్యదర్శి వాయుగుండ్ల సుప్రియ, తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

నెల్లూరు(బారకాసు): జగనన్న కాలనీల్లో నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన మేరకు అదనపు కార్మికులను నియమించి.. పనుల్లో వారిని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని అబ్దుల్ కలామ్ సమావేశ మందిరంలో హౌసింగ్, మెప్మా అధికారులతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వంద శాతం పనులు పూర్తయిన గృహాలను లబ్ధిదారులకు అందజేయాలని సూచించారు. కాలనీ నిర్మాణ సమయం నుంచే ప్రజలకు అందుబాటులో ఉండేలా రవాణా సౌకర్యాన్ని కల్పిస్తామని వెల్లడించారు. మెప్మా పీడీ రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

• నగరంలోని 16 / 1, 2 ఆదిత్యనగర్, రామ్‌జీనగర్ వార్డు సచివాలయాలను కమిషనర్ తనిఖీ చేశారు. సచివాలయాల్లోని పలు రికార్డులను పరిశీలించారు.

• నగరపాలక సంస్థ పరిధిలోని 2, 26, 15, 39, 40వ డివిజన్లకు సంబంధించి 8 సచివాలయాల కేంద్రాల్లో జగనన్న సురక్ష పథకాన్ని నిర్వహించారు.

వేడుకగా గోదాదేవి కల్యాణం

నెల్లూరు రూరల్: నరసింహకొండపై కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో గోదాదేవి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. స్వామివారు, ఆదిలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉభయకర్తలుగా కాకాణి నరహరి రెడ్డి కుటుంబసభ్యులు వ్యవహరించారు. ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



నెల్లూరు రూరల్: చింతారెడ్డిపాళెంలోని అల్ హుదా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఫైనలియర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపారు. మెకానికల్ విభాగ విద్యార్థి అన్నమయ్య 946 మార్కులు సాధించడంతో కరస్పాండెంట్ హరిప్రసాద్‌రెడ్డి అభినందించారు. ఈసెట్‌లో 500లోపు ఏడుగురు, వెయ్యిలోపు ర్యాంకులను 18 మంది సాధించారని తెలిపారు. ప్రిన్సిపల్ అనిల్‌కుమార్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ గిరిప్రసాద్, అకడమిక్ ఇన్‌చార్జి దీపక్ పాల్గొన్నారు.

కేజీబీవీల్లో పోస్టులకు స్కిల్ టెస్ట్



నెల్లూరు (టౌన్): కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో ఖాళీ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు స్కిల్ టెస్ట్‌ను జేసీ కూర్మనాథ్ ఆధ్వర్యంలో జిల్లా విద్యా శాఖ అధికారులు మంగళవారం నిర్వహించారు. పొదలకూరు రోడ్డులోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో సబ్జెక్టుల వారీగా స్కిల్ టెస్ట్‌ను జరిపారు. డెమో తరగతులను పరిశీలించి వారి ప్రతిభ ఆధారంగా మార్కులను డీఈఓ గంగాభవానీ, ఏపీసీ ఉషారాణి, జీసీడీఓ మమత, నిపుణులు కేటాయించారు. సర్టిఫికెట్ల పరిశీలన.. స్కిల్ టెస్ట్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా మెరిట్ జాబితాను సిద్ధం చేసి రాష్ట్ర విద్యాశాఖకు రెండు రోజుల్లో పంపనున్నారు. ఆయా సబ్జెక్టులకు 105 మందిని అర్హులుగా ప్రకటించగా, వీరిలో 91 మంది స్కిల్ టెస్ట్‌కు హాజరయ్యారు. గైర్హాజరైన 14 మందికి డెమో క్లాసులను బుధవారం నిర్వహించనున్నారు.

'జగనన్న సురక్ష'ను సద్వినియోగం చేసుకోండి

నెల్లూరు రూరల్: జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలని విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి పిలుపునిచ్చారు. రూరల్ పరిధిలోని 2, 26వ డివిజన్లలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సూచనలతో మంగళవారం నిర్వహించారు. దరఖాస్తు చేసుకున్న పలువురికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కమిషనర్ వికాస్ మర్మత్, తదితరులు పాల్గొన్నారు.

అడ్మిన్ల వాగ్వాదం

నెల్లూరు(బారకాసు): పాత మున్సిపల్ కార్యాలయంలోని సచివాలయంలో ఇద్దరు అడ్మిన్ల మధ్య వాగ్వాదం మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు.. పొర్లుకట్ట ప్రాంతంలో నివసిస్తున్న ఓ కుటుంబ యజమానికి సంబంధించిన ఆధార్‌కార్డును సరి చేసుకునేందుకు పాత మున్సిపల్ కార్యాలయంలోని 48 / 1 సచివాలయానికి వెళ్లారు. అక్కడి అడ్మిన్ మహ్మద్‌కు సమస్యను తెలియజేయగా, సదరు ప్రాంతానికి సంబంధించిన సచివాలయం ఇది కాదని.. అదే ప్రాంగణంలోని 48 / 2 సచివాలయానికి వెళ్లాలని సూచించారు. దీంతో సదరు సచివాలయానికి వెళ్లి అక్కడి అడ్మిన్ ఫైజు అహ్మద్‌ను కలవగా, మొదటి అడ్మిన్ చెప్పిన విధంగా ఇది తమ సచివాలయానికి సంబంధించింది కాదని బదులిచ్చారు. దీంతో ఇద్దరు అడ్మిన్ల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు రావడంతో ఇద్దరు అడ్మిన్లు సర్దుబాటు చేసుకొని తమ విధుల్లోకి వెళ్లారు. ఘటనపై డిప్యూటీ కమిషనర్ సచివాలయ కార్యదర్శులను విచారించి విషయం తెలుసుకున్నారు. ఇద్దరు అడ్మిన్లు వివరణను లిఖితపూర్వకంగా ఇవ్వాలని ఆదేశించారు.

అల్లూరి జీవితం స్ఫూర్తిదాయకం

నెల్లూరు(క్రైమ్): మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జీవితం స్ఫూర్తిదాయకమని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమాన్ని జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎస్పీ, ఏఎస్పీ హిమవతి, తదితరులు నివాళులర్పించారు. ఏఆర్ ఏఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీ గాంధీ, ఆర్‌ఐలు అంకమరావు, శ్రీనివాసులురెడ్డి, మౌలుద్దీన్, ఏఓ విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(బృందావనం): మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు యువతకు ఆదర్శప్రాయుడని రామకృష్ణ వివేకానంద భావ ప్రచార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బత్తిన సాయికుమార్‌రెడ్డి పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకొని మినీబైపాస్ రోడ్డులోని స్వామి వివేకానంద విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జయప్రకాశ్, శ్రీనివాసులు, మహేష్, శ్రీధర్, హర్షవర్ధన్, నవీన్, మురళి, అన్వేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

• ఏసీ కూరగాయల మార్కెట్ వద్ద అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అల్లూరి సీతారామరాజు జాతీయ యువజన సంఘ అధ్యక్షురాలు రమాదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు ఆటో డ్రైవర్లను సత్కరించారు. రచయితల సంఘ జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్ పాల్గొన్నారు.

నెల్లూరు (టౌన్): కొండాయపాళెం దళితవాడలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం వక్తృత్వ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. సీఆర్పీ బుజ్జమ్మ, ఉపాధ్యాయుడు హరీష్ పాల్గొన్నారు.

• నగరంలోని డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆర్‌ఐఓ, కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు, అధ్యాపకుడు రవీంద్రనాథ్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారులు కరుణకుమారి, భారతి, సుబ్బారెడ్డి, శ్రీధర్, శివయ్య, అల్లూరయ్య, కృష్ణతులసి పాల్గొన్నారు.

• స్టోన్‌హౌస్‌పేటలోని కేఏసీ జూనియర్ కళాశాలలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రిన్సిపల్ గురవయ్య, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ చెంచయ్య, అధ్యాపకులు సుధీర్, హరికృష్ణ, వేణుగోపాల్‌రెడ్డి, మెర్సీ, లాలస వీణ, షాజిదా, శ్రీనివాసులు, రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(సెంట్రల్): నగరంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో అల్లూరి సీతారామరాజు జయంతిని కేవీకే సమన్వయకర్త లలితా శివజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించారు.

నెల్లూరు(బారకాసు): బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ రవీంద్ర పేర్కొన్నారు. సుబేదారుపేటలోని మెప్మా కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. సిబ్బంది అంకయ్య, సుధాకర్, రామచంద్రరావు, చంద్రశేఖర్, హర్షిత, కాంతయ్య, రుక్సానా, రాజా పాల్గొన్నారు.

క్లుప్తంగా

వివాహిత ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): భర్త వేధింపులను తాళలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై చిన్నబజార్ పోలీసులు కేసును మంగళవారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. రామకోటయ్యనగర్‌కు చెందిన షబానా (35)కు మన్సూర్‌నగర్‌కు చెందిన సర్తాజ్ అహ్మద్‌తో 16 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. బంగారు పనులు చేసుకొని కుటుంబాన్ని ఆయన పోషించేవారు. తాను చేస్తున్న పనిని కొంతకాలంగా మానేసి ఇంట్లోనే ఖాళీగా ఉంటూ భార్య, పిల్లలను నిత్యం వేధించేవారు. నీవు చనిపోతే మరో వివాహం చేసుకుంటానంటూ భార్యను శారీరకంగా, మానసికంగా వేధించసాగారు. ఇదే విషయాన్ని తన తల్లికి ఫోన్ చేసి చెప్పి షబానా బాధపడేవారు. ఈ క్రమంలో తన ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు సోమవారం అర్ధరాత్రి ఆమె పాల్పడ్డారు. సమాచారం అందుకున్న తల్లి మమోల కుమార్తె ఇంటి వద్దకు చేరుకున్నారు. షబానా మృతదేహాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యారు. తన అల్లుడి వేధింపులతోనే షబానా ఆత్మహత్యకు పాల్పడిందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై సైదులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్‌ఎస్సైపై కానిస్టేబుల్ దాడి

నెల్లూరు(క్రైమ్): విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా ప్రశ్నించిన ఆర్‌ఎస్సైపై కానిస్టేబుల్ దాడి చేసి గాయపర్చిన ఘటన జిల్లా కోర్టు ఆవరణలో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. గార్డ్ డ్యూటీలను తనిఖీ చేయాల్సిందిగా ఆర్‌ఎస్సై కేఏస్సేన్ మూర్తిని అడ్మిన్ ఆర్‌ఐ ఆదేశించారు. దీంతో సోమవారం అర్ధరాత్రి సుమారు 1.20 గంటల ప్రాంతంలో జిల్లా కోర్టు ప్రాంగణంలో గార్డ్ విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందిని తనిఖీ చేసేందుకు మూర్తి వెళ్లారు. అయితే విధుల్లో ఉండాల్సిన సెంట్రీ కానిస్టేబుల్ రమేష్ కనిపించలేదు. దీంతో పక్క గదిలో ఉన్న గార్డ్ ఇన్‌చార్జిని ప్రశ్నించారు. ఇక్కడే ఉంటాడని చెప్పగా, చుట్టుపక్కల పరిశీలించారు. ఓ పక్కన సెంట్రీ నిద్రపోతూ కనిపించారు. దీంతో రమేష్‌ను నిద్ర లేపి.. సెంట్రీ విధుల్లో ఉండి నిద్రపోవడమేమిటి.. తుపాకుల భద్రతపై ఆర్‌ఎస్సై ప్రశ్నించారు. ఈ విషయాన్ని సెంట్రీ బుక్‌లో ఆర్‌ఎస్సై రాస్తుండగా, ఆగ్రహానికి గురైన రమేష్ కర్రతో దాడి చేశారు. గాయపడిన ఆర్‌ఎస్సై పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. వారి ఆదేశాల మేరకు చిన్నబజార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై సైదులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): పోక్సో కేసులో నిందితుడ్ని గంటల వ్యవధిలో సంతపేట పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. కపాడిపాళెంలో నివాసం ఉంటున్న 15 ఏళ్ల బాలికను అదే ప్రాంతానికి చెందిన ప్రశాంత్‌కుమార్ ప్రేమిస్తున్నానని కొంతకాలంగా వేధించసాగారు. ప్రేమించకపోతే చంపుతానని బెదిరించారు. విషయాన్ని తన తల్లిదండ్రులకు బాలిక తెలియజేయడంతో నిందితుడ్ని వారు మందలించారు. అయినా అతని ప్రవర్తనలో మార్పు రాలేదు. ఈ నెల ఒకటో తేదీన ఒంటరిగా ఉన్న బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. విషయాన్ని గమనించిన స్థానిక మహిళ గట్టిగా అరవడంతో నిందితుడు పరారయ్యాడు. దీంతో ఆమె జరిగిన విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు తెలియజేశారు. ఘటనపై సంతపేట పోలీసులకు సోమవారం రాత్రి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడ్ని అరెస్ట్ చేశారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

నెల్లూరు(క్రైమ్): అదనపు కట్నం కోసం వివాహితను వేధింపులకు గురిచేసిన భర్త, అత్తింటి వారిపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. వనంతోపునకు చెందిన లక్ష్మీరేవతికి కర్నూలుకు చెందిన వినయ్‌కుమార్‌తో పెద్దల సమక్షంలో సుమారు ఏడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. వివాహ సమయంలో రూ.ఐదు లక్షల నగదు, 30 సవర్ల బంగారు ఆభరణాలు, పెళ్లి ఖర్చుల నిమిత్తం మరో రూ.ఆరు లక్షలను కట్న కానుకల కింద అల్లుడికి ఇచ్చారు. ఉద్యోగ రీత్యా వినయ్‌కుమార్ హైదరాబాద్‌లో కాపురం పెట్టారు. అక్కడ ఇల్లు కొనుగోలు చేసేందుకు రూ.పది లక్షలు తీసుకురావాలని భార్యను ఆయన డిమాండ్ చేశారు. దీంతో ఆమె తన తల్లిదండ్రుల వద్ద సదరు మొత్తాన్ని తెచ్చిచ్చారు. ఈ క్రమంలో ఆయనకు బెంగళూరుకు బదిలీ అయింది. అక్కడా ఇల్లు, కారు కొనుగోలు చేసేందుకు భార్యపై తీవ్ర ఒత్తిడి తేవడంతో గత్యంతరం లేక మరో రూ.ఐదు లక్షలను తెచ్చి భర్త, అత్తింటి వారికి సమర్పించారు. అనంతరం ఆస్తి పంపకాలు చేసుకొని రావాలంటూ ఒత్తిడి తెచ్చారు. తీవ్ర వేధింపులకు గురిచేయడంతో ఆమె తన కుమార్తెతో కలిసి పుట్టింటికొచ్చారు. కాపురాన్ని చక్కదిద్దేందుకు పెద్ద మనుషుల సమక్షంలో ఆమె పలుమార్లు యత్నించగా ప్రయోజనం లభించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మోపెడ్ చోరీ

నెల్లూరు(క్రైమ్): టీవీఎస్ ఎక్సెల్ మోపెడ్ చోరీకి గురైన ఘటనపై వేదాయపాళెం పోలీసులు కేసును నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. కిసాన్‌నగర్‌లోని న్యూ కాలనీకి చెందిన పెంచలయ్య పూలను విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. తన ఎక్సెల్ మోపెడ్‌పై గాంధీనగర్‌లోని రేష్మీ హోటల్‌కు గత నెల 24న వచ్చారు. హోటల్ ముందు వాహనాన్ని నిలిపి భోజనం చేసేందుకు వెళ్లారు. అనంతరం వాహనం అదృశ్యమైంది. గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకపోవడంతో ఫిర్యాదు చేశారు.

అది యువగళం కాదు.. మాయాజాలం



మాట్లాడుతున్న స్వరాజ్

నెల్లూరు(దర్గామిట్ట): పాదయాత్ర పేరుతో టీడీపీ నేత లోకేశ్ జిల్లాలో చేపడుతోంది యువగళం కాదని.. అదో మాయాజాలమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ క్రిస్టియన్ సెల్ జిల్లా అధ్యక్షుడు స్వరాజ్ విమర్శించారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడారు. లోకేశ్ తన పాదయాత్రలో ఎవరో స్క్రిప్ట్ రాస్తే.. ఎవరో ఏదో చెప్తే దాన్ని మాట్లాడుతున్నారని చెప్పారు. సభకు జనాలు రాకపోతే చెన్నై, వెంకటగిరి, తదితర ప్రాంతాల నుంచి తరలించి భారీగా వచ్చారనే రీతిలో చూపుతున్నారని విమర్శించారు. లోకేశ్ ప్రసంగాన్ని ప్రజలు చీదరించుకుంటున్నారని చెప్పారు. క్రైస్తవులు, పాస్టర్లకు గౌరవ వేతనాన్ని అందజేసి మైనార్టీలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అక్కున చేర్చుకున్నారని తెలిపారు. సీఎం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను బాబు కాపీ చేసి ప్రకటిస్తే ప్రజలు నమ్మరని స్పష్టం చేశారు.

చేనేత, సిల్క్ ఎక్స్‌పోకు విశేష స్పందన



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థాన కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన జా తీయ చేనేత, సిల్క్ ఎక్స్‌పోకు విశేషాదరణ లభిస్తోందని జాతీయ చేనేత, వృత్తి కళాకారుల సంఘ మార్కెటింగ్ కో ఆర్డినేటర్ దేవకీదేవి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆమె మాట్లాడారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన చేనేత కళాకారులు తీర్చిదిద్దిన లేటెస్ట్ వెరైటీ ఉత్పత్తులు మహిళలు, యువతుల అభిరుచికి అనుగుణంగా ఉన్నాయని చెప్పారు. చేనేత వస్త్రాలు, పోచంపల్లి, మంగళగిరి, నారాయణపేట, చీరాల, బెంగాలీ కాటన్, కోల్‌కతా డిజైనర్, కలంకారీ, కశ్మీర్ శారీస్‌ను ఉత్పత్తి ధరలకే విక్రయిస్తున్నారని తెలిపారు. ఒక గ్రాము గోల్డ్ జ్యువెలరీ, హ్యాండీక్రాఫ్ట్స్ వస్తువులు ఉన్నాయన్నారు. ఈ నెల 16 వరకు రోజూ ఉదయం పది నుంచి రాత్రి పది వరకు ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. చేనేత, వృత్తి కళాకారుల సంఘ మేనేజర్ మహేష్ పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత ఆనం జయకుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు.

రిజర్వేషన్లను వర్తింపజేయొద్దని వినతి

నెల్లూరు (దర్గామిట్ట): ఎస్సీ, ఎస్టీలకు మాత్రమే రిజర్వేషన్లను కల్పించాలని, మతం మారిన వారికి వర్తింపజేయొద్దని ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘ వేదిక నేతలు కోరారు. ఈ మేరకు డీఆర్వో వెంకటనారాయణమ్మకు వినతిపత్రాన్ని మంగళవారం అందజేశారు. సంఘ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, రవి, జనార్దన్‌రావు, పొట్లూరి శ్రీనివాసులు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకే

నెల్లూరు(క్రైమ్): మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడితే జైలు ఊచలు లెక్కించాల్సిందేనని వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ నారాయణ హెచ్చరించారు. నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా సిబ్బందితో కలిసి అయ్యప్పగుడి, పడారుపల్లి, డైకస్‌రోడ్డు, తదితర ప్రాంతాల్లో విస్తృత తనిఖీలను మంగళవారం నిర్వహించారు. అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వివరాలను సేకరించారు. ఫింగ్స్ సాయంతో వేలిముద్రలను సేకరించి డేటాబేస్‌తో పరిశీలించారు. అర్ధరాత్రి వేళ రోడ్లపైకి అకారణంగా వస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పట్టుబడిన పలువురిపై కేసులు నమోదు చేశారు. రికార్డులు సక్రమంగా లేని వాహనాలను స్టేషన్‌కు తరలించారు.

భక్తిశ్రద్ధలతో తీర్థవాది

నెల్లూరు రూరల్: కనుపర్తిపాడులోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా తీర్థవాదిని మంగళవారం నిర్వహించారు. అనంతరం కోనేరులో చక్రస్నానం చేయించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు చేశారు. ఏకాంతసేవను రాత్రి నిర్వహించారు. ఉభయకర్తలుగా విజయకుమార్‌శర్మ, రమాదేవి.. నాగేశ్వరరావు, నందిత దంపతులు వ్యవహరించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చంద్రశేఖర్‌రెడ్డి పర్యవేక్షించారు.

ఏపీఎంలతో సమావేశం

నెల్లూరు(పొగతోట): గ్రామ సమాఖ్య సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి ఆదేశించారు. నగరంలోని డీఆర్‌డీఏ కార్యాలయంలో ఏపీఎంలతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి నెలా రెండు సమావేశాలను నిర్వహించి దానికి సంబంధించిన ఫొటోలను అప్‌లోడ్ చేయాలని సూచించారు. సమావేశాలకు హాజరుకాని సీసీలకు షోకాజ్ నోటీసులను జారీ చేయాలని చెప్పారు. బ్యాంక్ లింకేజీ రుణాలు, మహిళా పారిశ్రామికవేత్తలు, తదితరాలపై పొదుపు మహిళలకు అవగాహన కల్పించేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రికవరీలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఏపీడీ రాజు, తదితరులు పాల్గొన్నారు.

మత విద్వేషాలు రెచ్చగొట్టే వారిపై చర్యలు చేపట్టరూ..

నెల్లూరు(క్రైమ్): సోషల్ మీడియా వేదికగా మత విద్వేషాలను రెచ్చగొట్టే వారిపై చర్యలు చేపట్టాలని బీజేవైఎం కోస్తాంధ్ర జోనల్ ఇన్‌చార్జి యశ్వంత్ సింగ్ కోరారు. ఈ మేరకు నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డికి బీజేవైఎం నేతలతో కలిసి వినతిపత్రాన్ని మంగళవారం అందజేశారు. జితేంద్ర, బాలాజీ, కార్తికేయన్, తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం

నెల్లూరు(బారకాసు): నవాబుపేటకు చెందిన దాసరి శ్రీదేవి (65) తన నివాసంలో మంగళవారం మృతి చెందారు. ఈ క్రమంలో కుటుంబసభ్యుల అంగీకారంతో ఆమె నేత్రాలను ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి నేత్రదాన మోటివేటర్ బాలాజీసింగ్, ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ లాలేష్ సేకరించారు. సమాచారం అందించిన నేత్రదాన మోటివేటర్ సుబ్బారావుకు కృతజ్ఞతలను తెలియజేశారు. నేత్రదానం చేయాలనుకునే వారు 99481 64781, 93471 11033 నంబర్లను సంప్రదించాలని బాలాజీసింగ్ కోరారు.

ఫ్లోరోసిస్ నియంత్రణకు చర్యలు

నెల్లూరు(బారకాసు): ఫ్లోరోసిస్ వ్యాధికి గురికాకుండా నియంత్రణ చర్యలను చేపట్టాలని డీఎంహెచ్ఓ పెంచలయ్య పేర్కొన్నారు. సంతపేటలోని డీఎంహెచ్ఓ కార్యాలయ సమావేశ మందిరంలో వైద్యాధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నీటిలో అధిక శాతం ఫ్లోరిన్ ఉన్న గ్రామాలను గుర్తించి, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. నీటి నమూనా పరీక్షలు చేసేందుకు శాంపిళ్లను సేకరించి సంబంధిత ల్యాబ్‌కు పంపాలన్నారు.

సకాలంలో జీతాలివ్వాలి

నెల్లూరు(బారకాసు): ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాల, సర్వజన ఆస్పత్రిలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన విధులు నిర్వర్తిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు, నర్సింగ్ సిబ్బందికి సకాలంలో జీతాలివ్వాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు సతీష్‌కుమార్ కోరారు. ఈ మేరకు అసిస్టెంట్ డైరెక్టర్ సునీతా పురుషోత్తంకు వినతిపత్రాన్ని యూనియన్ ఆధ్వర్యంలో పలువురు నేతలు, సిబ్బంది మంగళవారం అందజేశారు. యూనియన్ అధ్యక్ష, కార్యదర్శి శ్రీనివాసులు, సందానీబాషా, వెంకటేశ్వర్లు, శ్రీవల్లి, కల్పన, చంద్రిక, మీరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలి

నెల్లూరు(లీగల్): న్యాయవాదుల రక్షణ కోసం లాయర్స్ ప్రొటెక్షన్‌ను వెంటనే అమలు చేయాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేనాటి చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. న్యాయవాదుల సమస్యలపై నిరసన కార్యక్రమాన్ని జిల్లా కోర్టు ఆవరణలో ఐఏఎల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. లా నేస్తం పథకంలో భాగంగా జూనియర్ న్యాయవాదులకు స్టయిపండ్‌ను అందించేలా చూడాలని కోరారు. వివిధ సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. సీనియర్ న్యాయవాదులు అబ్బాయిరెడ్డి, నాగేంద్రసాయి, బ్రహ్మం, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.


రోశయ్యకు ఘన నివాళి

నెల్లూరు(బృందావనం): మాజీ సీఎం కొణిజేటి రోశయ్య జయంతిని స్వాతంత్ర్య సమరయోధుడు చలమయ్య ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. సంతపేటలోని చలమయ్య నివాసంలో రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శరత్‌చంద్ర, రవీంద్రనాథ్, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

తెగిన విద్యుత్ వైర్లు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఈదురుగాలుల కారణంగా వెంకటేశ్వరపురంలోని పొర్లుకట్ట వద్ద 11 కేవీ విద్యుత్ వైర్లపై మంగళవారం తెల్లవారుజామున చెట్టు పడింది. దీంతో వైర్లు తెగిపోయాయి. సమాచారం అందుకున్న సిబ్బంది హుటాహుటినా ఘటన స్థలానికి చేరుకొని సరఫరాను నిలిపేశారు. అనంతరం సమస్యను పరిష్కరించారు.

సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం । 5 । జూలై । 2023



సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 28.734 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయంలో 91.227 మీటర్ల నీటిమట్టం నమోదైంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు) -రూ.60,360
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా) - రూ.5,421
3 శాతం జీఎస్టీతో.. - రూ.5,584
నవర (8 గ్రా) - రూ.44,672

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0 /26.2

మంగళవారం గాలిలో తేమ 66 శాతం ఉంది. బుధవారం ఉష్ణోగ్రతలు తక్కువగా ఉంటాయి. జిల్లాలో పలుచోట్ల జల్లులు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

నవరత్నాలతో హస్త కళాకారులకు లబ్ధి

నెల్లూరు(మినీబైపాస్): ప్రభుత్వం అమలు చేస్తున్న 'నవరత్నాల' పథకాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఎంతో మంది హస్త కళాకారులు లబ్ధి పొందుతున్నారని ఏపీ రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్(లేపాక్షి) చైర్‌పర్సన్ బడిగింజల విజయలక్ష్మి తెలిపారు. మంగళవారం నెల్లూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ హస్త కళాకారులు తయారు చేసిన కళాకృతులను ప్రతి ఒక్కరూ కొనుగోలు చేసి వారి జీవనోపాధికి సహకరించాలని కోరారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.చంద్రమౌళి, చేనేత ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు బి.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మికులను పనిలో చేర్చుకుంటే చర్యలు



నెల్లూరు(సెంట్రల్): బాలకార్మికులను పనిలో చేర్చుకుంటే చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని కార్మికశాఖ సహాయ కమిషనర్ గౌస్ పేర్కొన్నారు. మంగళవారం నెల్లూరులోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఇటీవల నమోదైన బాలకార్మికుల కేసులకు సంబంధించి 7 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. బాధితులకు అందాల్సిన రూ.43,834 నగదును వారికి ఇప్పించినట్లు తెలిపారు.

98 శాతం పింఛన్ల పంపిణీ

నెల్లూరు(పొగతోట): వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ ప్రక్రియ జిల్లావ్యాప్తంగా కొనసాగుతోంది. నాలుగో రోజు మంగళవారానికి 98 శాతం మంది లబ్ధిదారులకు వలంటీర్లు పింఛన్ నగదు పంపిణీ చేశారు. జిల్లాలో 3,04,686 మంది లబ్ధిదారులకు పింఛన్ కానుకను పంపిణీ చేయాల్సి ఉండగా, 2,98,579 మందికి అందజేశారు.

ఎక్కడికక్కడే పరిష్కారం

క్షేత్రస్థాయిలో ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కారమవుతున్నాయి. అధికారులే స్వయంగా ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుంటున్నారు. అవసరమైన ధ్రువీకరణ పత్రాలను ఒక్క పైసా ఖర్చు లేకుండా గ్రామాల్లోనే అందిస్తున్నారు. ఈ ప్రక్రియ అంతా సక్రమంగా జరిగేలా కలెక్టర్ నుంచి జిల్లాస్థాయి అధికారులంతా పర్యవేక్షిస్తున్నారు. 'జగనన్న సురక్ష' కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు ఎక్కడికక్కడే పరిష్కరిస్తుండడంతో జనం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- 'జగనన్న సురక్ష'తో సమస్యల నుంచి ప్రజలకు విముక్తి
- ఉదయగిరి సెగ్మెంట్‌లో కలెక్టర్ సుడిగాలి పర్యటన
- పాఠశాల, కళాశాల, అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ
- లబ్ధిదారుల సమస్యలను తెలుసుకున్న కలెక్టర్
- మెరుగైన పాలన అందించేలా చర్యలు
- ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లు గ్రామాల్లోనే అందజేత



కలెక్టర్ హరినారాయణన్: ఏమ్మా..అంగన్‌వాడీ కేంద్రం నుంచి అన్ని సరుకులు అందుతున్నాయా?
లబ్ధిదారు ప్రశాంతి: సార్, అన్నీ ఇస్తున్నారు. ప్రతిరోజూ కేంద్రానికి వచ్చి అన్నం తింటున్నా.
కలెక్టర్: అమ్మా.. బాబు పేరేమిటి?
ప్రశాంతి: వెంకట వర్షిత్.
కలెక్టర్: బాబు వయస్సుకు తగ్గ బరువు లేనట్లున్నాడు కదా?
ప్రశాంతి: అవును సార్.. అంగన్‌వాడీ టీచర్ ఆస్పత్రికి వెళ్లమని చెప్పింది. నేను వెళ్లలేదు సార్.
ఈ సంభాషణ సీతారామపురం మండలం ఎస్‌ఆర్ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం కలెక్టర్ హరినారాయణన్, లబ్ధిదారు ప్రశాంతి మధ్య జరిగింది. అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.



సీతారామపురం మండలం బాలాయపల్లి గ్రామంలో జరిగిన 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో కలెక్టర్ నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న లబ్ధిదారు వెంకటలక్ష్మమ్మ

ఉదయగిరి: సీతారామపురం మండలం బాలాయపల్లి గ్రామానికి చెందిన సీహెచ్ వెంకటలక్ష్మమ్మకు 'చేయూత' పథకం ద్వారా లబ్ధిపొందేందుకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అవసరమైన నేపథ్యంలో ఆమె వలంటీర్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. మంగళవారం బాలాయపల్లిలో జరిగిన 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో ఒక్క పైసా ఖర్చు లేకుండా రెండు ధ్రువీకరణ పత్రాలను ఆమె కలెక్టర్ ఎం.హరినారాయణన్ చేతులమీదుగా అందుకున్నారు. గత ప్రభుత్వంలో ఏ చిన్న సర్టిఫికెట్ కావాలన్నా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ పలుమార్లు తిరగాల్సివచ్చేదని, ప్రస్తుతం ఆ పరిస్థితి మారిందని, పైసా ఖర్చు లేకుండానే తమ మా గ్రామంలోనే అధికారులు సర్టిఫికెట్లు ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. ఇందుకు సీఎం జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం ఉదయగిరి నియోజకవర్గంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఇలాంటి ఎన్నో సర్టిఫికెట్లను అధికారులు లబ్ధిదారులకు అందజేశారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఉదయగిరి నియోజకవర్గంలోని సీతారామపురం, ఉదయగిరి, దుత్తలూరు, వింజమూరు, కలిగిరి మండలాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు సుడిగాలి పర్యటన చేసి పలు కార్యక్రమాల్లో పాల్గొని ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకున్నారు. సీతారామపురం మండలం బాలాయపల్లిలో జరిగిన 'జగనన్న సురక్ష' గ్రామసభలో వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజారెడ్డితో కలిసి లబ్ధిదారులకు పలు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అనంతరం బసినేనిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో నాడు–నేడు పనులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం మెనూ పరిశీలించి విద్యార్థులకు అందించే వంటకాలను రుచి చూశారు. ఎస్‌ఆర్ నగర్‌లో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి లబ్ధిదారులతో మాట్లాడారు.

ఉదయగిరి సీహెచ్‌సీలో మెరుగైన సదుపాయాలు

ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ వైద్యులతో మాట్లాడి అక్కడున్న వసతులు, ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్యశాలలో మరిన్ని వసతులు సమకూర్చేందుకు నిధులు మంజూరు చేస్తామన్నారు. త్వరలో సైక్రియాట్రిస్ట్‌ను నియమిస్తామని చెప్పారు. వైద్యశాలను మరింత అభివృద్ధి చేసేందుకు ఇంకా ఏం చేస్తే బాగుంటుందన్న కోణంలో కలెక్టర్ మాట్లాడారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాలలో 'నాడు–నేడు' పనులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. ఉదయగిరి మండలం గంగిరెడ్డిపల్లిలో జరుగుతున్న ఎస్‌సీడీ సర్వేను పరిశీలించి పలువురు లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం దుత్తలూరు మండలం నందిపాడులో ఉన్న కస్తూర్బా బాలికా విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. సరుకుల స్టాక్ పరిశీలించారు. దుత్తలూరు మండలం భైరవరంలో సచివాలయంలో ఏర్పాటు చేసిన 'జగనన్న సురక్ష' సర్వీస్ అమలు శిబిరాన్ని పరిశీలించి సర్వీసులు ఏ విధంగా అందుతున్నాయో లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. క్యాంపులో నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం బ్రహ్మేశ్వరం మండల పరిషత్ పాఠశాలలో 'ఫ్యామిలీ ఫిజీషియన్' కార్యక్రమం ద్వారా అందిస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఆయన వెంట ట్రైనీ కలెక్టర్ విద్యాధరి, ఐసీడీఎస్ పీడీ సౌజన్య, జిల్లా విద్యాశాఖాధికారి గంగాభవాని, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

ఆ కరెంట్ హెల్పర్ మాకొద్దు..!



నేలటూరు పంచాయతీలో ట్రాన్స్‌కో హెల్పర్‌గా పనిచేస్తున్న ప్రసాద్ విధులకు హాజరుకావడం లేదని, ఎన్నిసార్లు చెప్పినా లెక్కచేయడం లేదని, ఆయనను వెంటనే తమ గ్రామం నుంచి వేరొకచోటుకు బదిలీ చేసి కొత్తవారిని నియమించాలని నేలటూరు సర్పంచ్ నెల్లూరు వెంకటస్వామి కలెక్టర్‌ను కోరారు. స్పందించిన కలెక్టర్ హెల్పర్‌పై విచారణ జరిపి విధులు సక్రమంగా నిర్వహించేలా తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

రెవెన్యూ సమస్య పరిష్కారానికి ఆదేశం



ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు వెంకటయ్య. ఇతనిది ఉదయగిరి మండలం నేలటూరు గ్రామం. వెంకటయ్యకు రెండెకరాల సెటిల్‌మెంట్ భూమి ఉంది. కానీ 1బి, అడంగల్‌లో ఎక్కలేదు. కలెక్టర్ హరినారాయణన్ నేలటూరులో జరిగిన 'జగనన్న సురక్ష' గ్రామసభకు రావడంతో ఆయనకు తన సమస్యను వివరించాడు. స్పందించిన కలెక్టర్ వీఆర్వోను పిలిచి వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

- లోకేశ్‌ను అడగాల్సిన ప్రశ్నలు సిద్ధం చేసి ఇస్తున్న నేతలు
- యథార్థాలకు మసిపూసి అబద్ధాలు చెప్పిస్తున్న నేతలు

వాస్తవాలను దాచేసి..!

కావలి మహిళతో అడిగించిన ప్రశ్న..

'నా భర్త పేరు అమీర్‌ఖాన్. మాది కావలి. వైఎస్సార్‌సీపీ నాయకులు నా భర్తను ఉద్దేశపూర్వకంగా వేధిస్తున్నారు. మేము ప్రహరీ కట్టుకుంటే దాన్ని జేసీబీతో కూల్చేశారు. ఆ సమయంలో పక్షులు, కుందేళ్లు చనిపోయాయి. మాతోపాటు మాకు మద్దతుగా నిలిచిన టీడీపీ నేతలు 12 మందిపై అట్రాసిటీ కేసు నమోదు చేయించారు'

వాస్తవం ఏంటంటే..

కావలి పట్టణంలోని తుఫాన్‌నగర్ ప్రాంతం 19వ వార్డులో టీడీపీ కావలి పట్టణ యువజన విభాగం కార్యదర్శి పఠాన్ అమీర్‌ఖాన్ ఇంటి ముందు 60 అడుగుల రోడ్డు ఉంది. సిమెంటు అచ్చులు తయారుచేసి విక్రయించే అమీర్‌ఖాన్ తన ఇంటి ముందు ఉన్న రోడ్డును 20 అడుగుల మేర ఆక్రమించి చుట్టూ ఇనుపకంచె కాంపౌండ్‌ను సృష్టించాడు. ఆ స్థలంలో మొక్కలు, పక్షులు, కోళ్లు, జంతువులు పెంచడం ప్రారంభించాడు. అంతేకాక అతను పెంచుతున్న పావురాళ్ల వల్ల దుర్వాసన వస్తుండడంతో స్థానికులు మున్సిపల్ అధికారులను కలిసి పరిస్థితిని వివరించారు. రోడ్డు ఆక్రమణను తొలగించాలని ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన మున్సిపల్ అధికారులు అమీర్‌ఖాన్ ఇంటికి వెళ్లి రోడ్డు ఆక్రమణలు తొలగించాలని సూచించగా అతను అధికారుల పట్ల దురుసుగా ప్రవర్తించి, ఆక్రమణలు తొలగించే ప్రసక్తే లేదని సవాల్ చేశారు. దీంతో మున్సిపల్ అధికారులు పోలీసుల బందోబస్తు నడుమ గత ఏడాది జూలైలో రోడ్డు ఆక్రమణలను తొలగించారు. ఈ క్రమంలో టీడీపీ నాయకులు మున్సిపల్ కార్యాలయానికి చేరుకొని అధికారులు, సిబ్బంది పట్ల దురుసుగా ప్రవర్తించగా వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కావలి వన్‌టౌన్ పోలీసులు ఇరువర్గాలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ప్రస్తుతం అది విచారణలో ఉంది. అయితే నెల్లూరులో నారా లోకేశ్ వద్దకు పఠాన్ అమీర్‌ఖాన్ భార్య పఠాన్ ఫరీహాను తీసుకెళ్లిన టీడీపీ నాయకులు ఆమెతో వైఎస్సార్‌సీపీ నాయకులు నా భర్తను ఉద్దేశపూర్వకంగా వేధిస్తున్నారు. మాతోపాటు మాకు మద్దతుగా నిలిచిన టీడీపీ నాయకులు 12మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి వేధిస్తున్నారని చెప్పించారు. నిజానిజాలతో నిమిత్తం లేకుండా టీడీపీ నాయకులు చెప్పిందే నిజమని నమ్మాలని ప్రచారం చేసే ఎల్లోమీడియా ఈ అంశాన్ని కూడా యథావిధిగా అచ్చేసింది.



రోడ్డును ఆక్రమించి నిర్మించిన షెడ్ (ఫైల్)

వైకాపా ప్రభుత్వం పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం లేదు. మీరొచ్చాక పునరుద్ధరిస్తారా ?
– దేదీప్య, ఎంసీఏ విద్యార్థిని

వాస్తవ పరిస్థితి ఏంటంటే..

గతంలో ఫీజురీయింబర్స్‌మెంట్ పథకం ప్రవేశపెట్టే సమయంలో బీసీ, ఈబీసీ, మైనారిటీ, కాపు విద్యార్థుల ఇంజినీరింగ్ విద్యకు ఏడాదికి రూ.35 వేలు మాత్రమే విడుదలవుతూ వచ్చాయి. కానీ కొన్ని పెద్ద కళాశాలల్లో(గ్రేడ్–1) ఇంజినీరింగ్ ఫీజు ఏడాదికి రూ.60 వేలు నుంచి రూ.80 వేల వరకు ఉంది. ప్రభుత్వం విడుదల చేసే రూ.35 వేలు మినహాయించి మిగిలిన ఫీజు ఆయావర్గాల విద్యార్థుల తల్లిదండ్రులు చెల్లించాల్సి వచ్చేది. ఈ నేపథ్యంలోనే అనేక మంది తల్లిదండ్రుల ఆర్థిక కష్టాలను తీర్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫీజురీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని పెంచాలని నిర్ణయం తీసుకున్నారు. అందులో భాగంగా 'జగనన్న విద్యాదీవెన' ద్వారా విశ్వవిద్యాలయాలు నిర్ణయించిన ఫీజు మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించేలా చర్యలు తీసుకున్నారు. దీంతో అనేక మంది విద్యార్థులు ఇంజినీరింగ్, మెడిసిన్ పూర్తి చేసి జీవితంలో స్థిరపడుతూ కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నారు.

పెండింగ్‌ను క్లియర్ చేసిన జగన్ సర్కార్

2017–18, 2018–19 విద్యా సంవత్సరాల్లో చంద్రబాబు ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న ఫీజును కూడా వైఎస్ జగన్ సర్కార్ 2019–20 విద్యా సంవత్సరంలో విడుదల చేసింది. జిల్లాలో 1.42 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన అరియర్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది.

నాలుగేళ్లలో రూ.578.21 కోట్లు

రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో ఇప్పటి వరకు జగనన్న విద్యా, వసతి దీవెన కింద అక్షరాల ప్రతి ఏడాది సగటున లక్షా పది వేల మందికి పైగా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.578.21 కోట్లు జమ య్యాయి.

– సాక్షి ప్రతినిధి నెల్లూరు

జిల్లాలో గత నాలుగేళ్లలో జగనన్న విద్యా, వసతి దీవెన వివరాలు

		విద్యాదీవెన		వసతిదీవెన	
వ.సం.	నియోజకవర్గం	లబ్ధిదారులు	నిధులు (రూ.కోట్లలో)	లబ్ధిదారులు	నిధులు (రూ.కోట్లలో)
1.	ఆత్మకూరు	11,767	37.03	17,572	19.94
2.	కందుకూరు	12,528	18.68	12,159	11.87
3.	కావలి	12,001	58.14	12,201	23.97
4.	కోవూరు	12,527	51.35	18,970	24.26
5.	నెల్లూరు నగరం, సిటీ	29,286	109.47	30,639	54.18
6.	సర్వేపల్లి	11,283	42.25	24,074	23.51
7.	ఉదయగిరి	14,595	38.20	23,396	22.92
8.	వెంకటగిరి (3 మండలాలు)	5,503	26.79	13,403	13.31

స్టోన్‌హౌస్‌పేట సబ్ రిజిస్ట్రార్ సస్పెన్షన్

నెల్లూరు సిటీ: స్టోన్‌హౌస్‌పేట సబ్ రిజిస్ట్రార్‌ను సస్పెండ్ చేస్తూ నెల్లూరు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్ కిరణ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. స్టోన్‌హౌస్‌పేట రిజిస్ట్రేషన్ పరిధిలో భూ రిజిస్ట్రేషన్‌లో అక్రమాలు జరిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఉన్నతాధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకుంటూ మంగళవారం రాత్రి సబ్ రిజిస్ట్రార్ ఐ.విజయరాణిని సస్పెండ్ చేశారు.

టీడీపీలో ఫ్లెక్సీల కొట్లాట

- పోలంరెడ్డి, పెళ్లకూరు వర్గాల ఆధిపత్య పోరు
- యువగళంతో భగ్గుమన్న వర్గ విభేదాలు

కోవూరు: జిల్లాలో నారా లోకేశ్ చేస్తున్న యువగళం యాత్ర జరుగుతుండగానే కోవూరులో పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి వర్గాల మధ్య మంగళవారం రాత్రి వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. వివరాల్లోకెళితే.. లోకేశ్ యువగళం యాత్ర నియోజకవర్గంలో అడుగుపెడుతున్న సమయంలో ఇరువర్గాలకు చెందిన నాయకుల నడుమ గొడవలు రాకుండా పార్టీ పరిశీలకులు పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డికి సాలుచింతల సెంటర్ వద్ద, పాటూరు రోడ్డు వద్ద, దామరమడుగుసెంటర్‌లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. అయితే అప్పటికే ఆయా ప్రాంతాల్లో పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి వర్గం ఫ్లెక్సీలు ఏర్పాటు చేసింది. దాన్ని చూసి ఆగ్రహావేశాలకు గురైన పెళ్లకూరు వర్గానికి చెందిన దాదాపు 20 మంది పోలంరెడ్డి ప్రధాన అనుచరుడిపై గొడవకు దిగారు. ఆ సమయంలో అక్కడే ఉన్న పోలంరెడ్డి వర్గానికి చెందిన వారు పెళ్లకూరు వర్గంపై ఎదురుదాడికి దిగారు. దీంతో కొద్దిసేపు ఆ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నారా లోకేశ్ వద్ద గుర్తింపు పొందేందుకు ఇరువర్గాల నాయకులు చేస్తున్న ప్రయత్నాలను చూసి స్థానికులు నివ్వెరపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుంటున్నారన్న విషయం తెలుసుకుని ఇరువర్గాల వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

మమ్మల్ని వదిలెయ్ భాయ్..!



'క్యా భాయ్.. పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు మేము కన్పిస్తాం.. ఇప్పుడు మేం పనికిరామా?.. మాపై దాడులు చేశారు. చివరకు చంపించేందుకు కూడా వెనకాడలేదు. కేసులు నమోదు చేయించి చిత్రహింసలకు గురిచేశారు. వాటన్నింటినీ తట్టుకుని పార్టీ కోసం పనిచేశాం. మాకు ఇంత అన్యాయం చేసిన వ్యక్తికే మళ్లీ చెయ్యాలంటున్నారు. ప్రజలకు ఏమి సమాధానం చెప్పాలి. పార్టీని నమ్ముకున్నందుకు మా గొంతులు కోశారు'.. మమ్మల్ని వదిలెయ్ భాయ్.. మా బతుకులు మేం బతుకుతాం.. ఇదంతా టీడీపీ నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ మనసులోని ఆవేదన.

- పార్టీని నమ్ముకుంటే గొంతు కోశారు
- పత్రికా ప్రకటనలో కూడా ఫొటో లేకుండా చేశారు
- ఇంతకంటే అవమానం ఏముంటుంది?
- సన్నిహితులతో వాపోయిన అజీజ్

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో జరిగిన యువగళం కార్యక్రమంలో పాల్గొనేందుకు టీడీపీ నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ ఆసక్తి చూపకపోవడంతో ప్రకాశం జిల్లాకు చెందిన టీడీపీ నేత.. అజీజ్ నివాసానికి వెళ్లి సముదాయించేందుకు ప్రయత్నించగా పార్టీలో తనకు జరిగిన అన్యాయాన్ని అజీజ్ ఏకరువు పెట్టారు. తనతోపాటు పార్టీని నమ్ముకున్న మరో ముగ్గురు నేతలు కూడా ఇదే పరిస్థితిలో ఉన్నారని ఆయన అన్నట్లు తెలుస్తోంది.

మైనార్టీలకు అన్యాయం

టీడీపీలో మైనార్టీలకు అన్యాయం జరుగుతుందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ సారథ్య బాధ్యతలు తీసుకునేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో మైనార్టీ నేత అబ్దుల్ అజీజ్ ముందుకువచ్చారు. పార్టీని నడిపించడంలో తనదైన పాత్ర పోషించారు. గతంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కూడా శక్తికి మించి పనిచేశారు. ఓవైపు ఆ పార్టీలో ఉన్న కీలక నేతలు సైతం టీడీపీకి వెన్నుపోటు పొడిచి తమ పార్టీ అభ్యర్థులనే ఓడించేందుకు డబ్బులు ఎర వేశారు. ఇలాంటి రాజకీయ జిమ్మిక్కులు జరిగినా అబ్దుల్ అజీజ్ పార్టీ వెంటే ఉన్నారు. అతని అనుచరులపై దాడులు చేసి, హత్యాయత్నాలు చేయించారు. అలాగే అతని ఆర్థిక మూలాలను దెబ్బతీసి కోలుకోలేని విధంగా చేశారు. అన్నింటినీ భరించి పార్టీ జెండా మోసిన అజీజ్‌ను పార్టీ కరివేపాకులా వాడుకుంది. నాలుగేళ్లపాటు ఎవరైతే టీడీపీని ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగించారో ఆ నేతకే జైకొట్టినట్లు తెలుస్తోంది. నెల్లూరు నగరంలో మంగళవారం జరిగిన లోకేశ్ యువగళం పాదయాత్ర రూట్‌మ్యాప్‌తోపాటు పార్టీ మేనిఫెస్టోను ఓ ప్రముఖ దినపత్రికకు టీడీపీ నగర నేతలు ప్రకటన రూపంలో ఇచ్చారు. అందులో టీడీపీ అధినేత చంద్రబాబు, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుతోపాటు నెల్లూరు నగర, రూరల్ ఇన్‌చార్జిల ఫొటోలు మాత్రమే ప్రచురించారు. ఆ పార్టీ నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడిగా ఉన్న అజీజ్ ఫొటో వేసేందుకు ఒప్పుకోలేదని తెలుస్తోంది. తన ఫొటో ప్రకటనలో వేసేందుకు కూడా ఇష్టపడకపోవడాన్ని ఆయన తీవ్ర అవమానంగా భావించి సన్నిహితుల వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

అదే బాటలో మరికొందరు..

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే తీరుతో తీవ్రంగా నష్టపోయిన మరికొందరు నేతలు కూడా యువగళం పాదయాత్రకు వెళ్లేందుకు ఇష్టపడలేదని తెలుస్తోంది. నాలుగేళ్ల పాలనలో టీడీపీ నేతలను ముప్పతిప్పలు పెట్టిన నేతను పార్టీలోకి తీసుకొచ్చి సలామ్ కొట్టమనడంపై నేతలు భగ్గుమంటున్నారు. కష్టకాలంలో పార్టీని నమ్ముకుని జెండా మోస్తే మాకిచ్చే బహుమతి ఇదేనా అంటూ ద్వితీయ శ్రేణి నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టీడీపీలో క్రియాశీలకంగా ఉన్న రాజానాయుడు, పెంచలనాయుడు, మరికొందరు నేతలు అజీజ్ బాటనే ఎంచుకున్నట్లు రాజకీయవర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

- లోకేశ్ సభను విజయవంతం చేసేందుకు టీడీపీ నేతల తంటాలు
- డబ్బులు ఎరచూపి జనాలను తరలించినా..
- సభ ప్రారంభమైన కొన్ని నిమిషాలకే జారుకున్న వైనం

ఇటు తరలింపు.. అటు ఉడాయింపు



సభ ప్రారంభమైన కొన్ని నిమిషాలకే వెళ్లిపోతున్న జనం

నెల్లూరు సిటీ: జిల్లాలో తెలుగుదేశం పార్టీ పరిస్థితి అంతంతమాత్రంగానే ఉంది. లోకేశ్ పాదయాత్ర నెల్లూరులోకి చేరుకున్న రోజు నుంచి నియోజకవర్గాల్లోని టీడీపీ నేతలు పాదయాత్రను విజయవంతం చేసేందుకు నానా తంటాలు పడుతున్నారు. ఈ క్రమంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని అనిల్‌గార్డెన్స్ నుంచి కేవీఆర్ పెట్రోల్‌బంక్ మీదుగా వీఆర్సీసెంటర్ వరకు పాదయాత్ర చేసి బహిరంగ సభ నిర్వహించారు. అయితే పాదయాత్రను, సభను విజయవంతం చేసేందుకు నగరం, రూరల్ నియోజకవర్గాలతోపాటు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి జనాలను తరలించారు. టీడీపీ నేతలు చోటా నేతలకు జనాలను తరలించేందుకు ఒక్కొక్కరికి రూ.500 ఇస్తే జనాలకు రూ.300 మాత్రమే ఇచ్చి మిగిలినవి జేబుల్లోకి సర్దుకున్నట్లు తెలిసింది. ఎంత డబ్బు ఎరచూపి పాదయాత్ర, సభను విజయవంతం చేద్దామని ప్రయత్నించినా ప్రయోజనం లేకపోయింది. సభ ప్రారంభమైన నిమిషాల్లోనే జనం వెనుదిరిగి వెళ్లిపోవడం గమనార్హం. లోకేశ్ మాట్లాడుతుండగానే జనం వెళ్లిపోతుండడంతో టీడీపీ నేతలు ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది.

లోకేశ్ దిష్టిబొమ్మల ఊరేగింపు

నెల్లూరు రూరల్ నుంచి పాదయాత్ర చేస్తుండగా మూడు వాహనాలపై లోకేశ్ దిష్టిబొమ్మలను పసుపు కుర్చీల్లో కూర్చోపెట్టి ఊరేగిస్తుండగా అది చూసి ప్రజలు నవ్వుకున్నారు. ఇప్పటికే లోకేశ్ ప్రసంగాల్లో పలుమార్లు తప్పులుదొర్లుతూ నవ్వుల పాలైన ఘటనలు చాలా ఉన్నాయి.

పాదయాత్రకు అజీజ్ డుమ్మా

రూరల్ నియోజకవర్గం నుంచి నేనే పోటీ చేస్తున్నా.. రానున్న ఎన్నికల్లో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిపై గెలిచి తీరుతానని తన అనుచరుల వద్ద చెప్పుకున్న అజీజ్‌కు టీడీపీ పెద్దలు హ్యాండిచ్చి ఇటీవల కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి ప్రాధాన్యం ఇవ్వడంతో లోకేశ్ పాదయాత్రకు అజీజ్ డుమ్మాకొట్టినట్లు తెలుస్తోంది. అతని సోదరుడు జలీల్, ముఖ్య అనుచరులు సైతం పాదయాత్రకు దూరంగా ఉన్నారని తెలిసింది. అయితే సోమవారం సాయంత్రం వరకు డివిజన్లలో తిరిగిన అజీజ్ మంగళవారం పాదయాత్ర ప్రారంభానికి ముందు ఆరోగ్యం సరిగా లేదని వెళ్లలేదని సమాచారం.

తాతను విస్మరించిన మనవడు

టీడీపీ వ్యవస్థాపకులు, స్వయాన తాత అయిన ఎన్టీఆర్‌ను మనవడు లోకేశ్ విస్మరించారు. వీఆర్సీసెంటర్‌లో సభ అనంతరం గాంధీబొమ్మ మీదుగా ఆత్మకూరు బస్టాండ్ వైపుగా పాదయాత్రగా వెళుతున్న క్రమంలో నర్తకి సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహం ఎదురుగా కనబడుతున్నా లోకేశ్ ఏమీ పట్టనట్లు వెళ్లిపోవడం గమనార్హం. తన తాత విగ్రహానికి కనీసం పూలమాల వేసి నివాళులర్పించకపోవడంపైటీడీపీ కార్యకర్తలు, నందమూరి అభిమానులు మండిపడుతున్నారు.